క్లుప్తంగా

24న మెగా వైద్య శిబిరం

పలమనేరు: పట్టణంలోని గుండుబావి ఎదురుగా ఉన్న వాణి కళాశాల ప్రాంగణంలో ఈ నెల 24న పలమనేరు లయన్స్ క్లబ్, జిల్లా మెడికల్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జయశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యుల బృందం రోగులను పరీక్షిస్తుందని, దీనిని పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హుండీ ఆదాయం రూ.5.48 లక్షలు

గంగవరం: మండలంలోని ప్రసిద్ధి చెందిన టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కానుకల రూపేణా రూ. 5.48 లక్షలు సమకూరిందని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయాభివృద్ధి, స్వామివారి ఉత్సవాలు, కైంకర్యాలకు వినియోగిస్తామన్నారు. ఇక్కడ ప్రతి మూడు నెలలకోసారి హుండీ ఆదాయం లెక్కించడం పరిపాటి.

పన్నులు సకాలంలో చెల్లించండి

పుంగనూరు: ఆస్తిపన్ను, నీటి పన్నును ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లించి, మున్సిపాలిటీకి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీలో పన్నులు వసూళ్లు సచివాలయ ఉద్యోగులు చేస్తున్నారని, ప్రస్తుతం బకాయిలు రూ.5.05 కోట్లు బకాయిలు ఉన్నాయి. నీటి పన్ను రూ.1.81 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటి బకాయిలు అధికంగా ఉండటంతో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. వసూలు చేసేందుకు మున్సిపల్ ఆర్వోతో సహా సిబ్బందిని పంపి, స్పెషల్‌డ్రైవ్ చేపడుతామన్నారు. పన్నులు చెల్లించకపోతే కఠిన చర్యలు చేపడుతామని, యజమానులకు మౌలిక వసతులు ఆపి వేస్తామని ఆయన హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి



రైతులతో మాట్లాడుతున్న ఏడీ పద్మజ

గంగవరం: వరిలో సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీ పద్మజ కోరారు. మండలంలోని మేలుమాయిలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వేరుశనగ, రాగిలో బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు యూరియా ద్రావణం, పొటాషియం నైట్రేట్‌ను తగిన మోతాదులో సరిపడా పిచికారీ చేయాలన్నారు. తద్వారా పంటల్లో బెట్ట పరిస్థితులను అధిగమించి దిగుబడి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏవో హేమలత, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డీఆర్‌కు వీడ్కోలు సన్మానం



డీఆర్ శ్రీనివాసరావు సన్మానించిన డీఐజీ

చిత్తూరు కార్పొరేషన్: వృత్తిపరంగా ప్రశాంతంగా ఉంటూ మంచి వ్యక్తిగా డీఆర్ శ్రీనివాసరావు పేరు తెచ్చుకున్నారని డీఐజీ గిరిబాబు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఏలూరుకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన రిలీవ్ అవడంతో సిబ్బంది వీడ్కోలు సన్మానం చేసి ఆయన సేవలను ప్రస్తుతించారు. ప్రతి ఒకరితో మర్యాదగా మాట్లాడుతూ సౌమ్యంగా ఉండేవారన్నారు. ఉద్యోగి జీవితంలో బదిలీ సహజమని, ఎక్కడ ఉన్నా సంతోషంగా ఉంటాలని డీఐజీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు రహంతుల్లా, రాజా రమేష్, చలపతి, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశం ఉన్నా సీట్లు రాని పరిస్థితి



కొత్త మెడికల్ కాలేజీలతో తప్పకుండా విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని చాలామంది తల్లిదండ్రులు ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీలను నిర్వహించడానికి బదులు ప్రైవేటు పరం చేయడం దారుణం. ఫలితంగా సీట్లు పోయాయి. దీంతో కటాఫ్ పెరిగి అందరి అంచనాలు తప్పాయి. మెడిసిన్ చేయాలనే ఎందరో పేదల విద్యార్థుల ఆశలు అడియాశలయ్యాయి. ఇదే కొత్త కళాశాలలకు తెలంగాణలో మాత్రం అక్కడి ప్రభుత్వం సీట్లకు ఒప్పుకుంది కదా! మనరాష్ట్రంలో చూస్తుంటే దిగజారుడు రాజకీయాలకు వైద్య విద్యను పేదలకు అందకుండా చేస్తున్నారనుకోవాలి. -సుబ్రమణ్యం రెడ్డి, తండ్రి, కల్లాడు



కొత్త మెడికల్ కాలేజీలతో సీట్ వస్తుందనుకున్నా..!



ఈసారి కొత్త మెడికల్ కాలేజీల రాకతో మెడిసిన్ సీట్ వస్తుందనుకున్నా. నాకొచ్చిన మార్కులకు గవర్నమెంట్ సీటు రాలేదు. అందుకే కేటగిరి-బి కోసం ట్రై చేయాలి. అయితే కటాఫ్ మార్కులు తెలంగాణ కంటే మన రాష్ట్రంలోనే ఎక్కువ కాబట్టి ఈ సమస్య వచ్చింది. మెడిసిన్ చేయాలనే ఎన్నో ఆశలతో ఉన్న వారికి ప్రభుత్వ నిర్ణయం ఒక శాపమవుతోంది. -స్వాతి, నీట్ లాంగ్ టర్మ్ స్టూడెంట్, తిరుపతి

వీటిని సీజ్ చేసే దమ్ముందా..?





పలమనేరు బైపాస్ సమీపంలో ముసలిమడుగు వద్ద నిల్వ ఉన్న ఇసుక డంపులు

- పలమనేరులో భారీగా ఇసుక డంపులు
- తెలిసినా పట్టించుకోని అధికారులు
- ఇదీ కూటమి నేతల ఇసుక దందా

4 నెలల్లోనే లక్షాధికారులైన వారెందరో..!

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో కూటమి పేరు చెప్పుకొని కొందరు ఇసుకను చెరువులు, కౌండిన్య నది నుంచి భారీగా తరలించి డంపులు పెట్టారు. టన్నుల కొద్దీ ఇసుకతో డంపులు కనిపిస్తున్నా, సంబంధిత అధికారులకు వీటి గురించి తెలిసినా వీటిని సీజ్ చేసే సాహసం చేయడం లేదు. దీంతో ఇక్కడి ఇసుకాసురుల వ్యాపారం ఆరు ట్రాక్టర్లు–పన్నెండు టిప్పర్లు అన్న చందాన మారింది. ఈ ప్రాంతానికి సమీపంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉంది. దీంతో రాత్రిపూట ఇసుకను కర్ణాటకకు యథేచ్ఛగా చేరవేస్తున్నారు.

ఇదిగో సాక్ష్యాలు

- పట్టణ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో ఓ టీడీపీ నేత వందల లోడ్ల ఇసుకను నిల్వచేశాడు. ఎవరైనా అనుమానం కొద్దీ ప్రశ్నిస్తే.. తన ఇంటి నిర్మాణానికని చెవిలో పువ్వు పెడుతున్నాడు. ఇంటికి మహా అయితే రెండు టిప్పర్ల ఇసుక సరిపోతుంది. కానీ ఇన్ని లోడ్లు ఎందుకనే విషయాన్ని అడిగేవారే లేకుండాపోయారు.
- పలమనేరు మండలంలోని ముసలిమడుగులో ముగ్గురు పచ్చనేతలు భారీగా మూడు డంపుల్లో ఇసుకను నిల్వ చేశారు. అక్కడికి పోలీసులు సైతం వెళ్లేందుకు జంకుతున్నారు.
- సముద్రపల్లె, కూర్మాయి, పెంగరగుంటలో నాలుగైదు భారీ ఇసుక డంపులున్నాయి.
- గంగవరం మండలంలో పది వరకూ ఇసుక డంపులున్నా సంబంధిత అధికారులు తమకెందులే అనే ధోరణిలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.
- ఇదే పరిస్థితి బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి మండలాల్లో సైతం ఉంది. ఇసుకాసురులంతా టీడీపీ నేతలమంటూ పోలీసులు, అధికారులను బెదిరించకుంటూ తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు.

సరిహద్దు దాటితే టిప్పర్ రూ.30వేలకు పైమాటే..!

ఇక్కడ ఎక్కువమంది ఇసుకాసురులు భారీగా ఇసుకను తోడేయడంతో ఇసుకకు డిమాండ్ కాస్త తగ్గింది. ప్రభుత్వం చెప్పినట్టు ఇక్కడ అధికారిక డంపు పాయింట్, ఆన్‌లైన్ ఇసుక వ్యాపారాలు జరగడం లేదు. ఇసుక కావాలంటే ఆయా ప్రాంతాలకు చెందిన కూటమి నేతలను సంప్రదిస్తే చాలు. అప్పటికీ ఇసుక ఎక్కువైపోవడంతో ఇక్కడికంటే కర్ణాటకలో ఇసుకకు భారీగా డిమాండ్ ఉంది. దీంతో రాత్రుల్లో కర్ణాటకకు చెందిన టిప్పర్లలోనే ఇసుకను హోస్‌కోట వ్యాపారులకు అమ్మేస్తున్నారు. ఇక్కడ అమ్మితే టిప్పర్ రూ.24 వేల నుంచి 28 దాకా కొని కర్ణాటక వ్యాపారులు అక్కడ రూ.35 వేలకుపైగా అమ్ముతున్నారు. ఏదేమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే పలమనేరు డివిజన్‌లోని 400మంది ఇసుకాసురులు లక్షాధికారులుగా మారిపోయారంటే ఇక్కడ ఇసుక వ్యాపారం ఏ రేంజ్‌లో సాగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

నిమజ్జన కోలాహలం



చిలక పుత్తూరులో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు, గ్రామస్తులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట పంచాయతీ చిలకపుత్తూరులో గురువారం కోలాహలంగా వినాయకుని నిమజ్జనం చేశారు. 13 రోజులు ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మండపం వద్ద అన్నదానం చేశారు. అనంతరం విగ్రహాలను ట్రాక్టర్‌లో మేళతాళాలు, బాణసంచా మోత నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవపై అవగాహన



పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మెప్మా అధికారులు

పలమనేరు: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కార్మికుల వర్తించు ప్రభుత్వ పథకాలపై మెప్మా అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఇదే కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆపై పట్టణంలో డంప్ సైట్స్‌ను శుభ్రం చేసి వ్యర్థాలను కంపోస్ట్ యార్డుకు తరలించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'మహాభారత యజ్ఞం' ప్రారంభం



ధ్వజారోహణ పూజల్లో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, నాయకులు

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతంమిట్ట కావమ్మ, మారయ్యల వద్ద మహాభారత యజ్ఞం గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి లక్ష్మిరెడ్డి జ్ఞాపకార్థం 18 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరయ్యారు. వేద పండితుల ఆధ్వర్యంలో పాండవ, ద్రౌపదీ దేవి విగ్రహానికి పూజలు చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి జ్యోత్స్న హరికథాగానం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి నుంచి వెంకటేశ్వర నాట్య కళామండలికి చెందిన కళాకారుల నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, మల్‌రెడ్డి, రామాంజులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డలకు పౌష్టికాహారం ముఖ్యం



తల్లీబిడ్డలను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గుడుపల్లె: తల్లీబిడ్డలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని ఎంపీపీ వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక శ్రీశక్తి భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లీబిడ్డలకు పౌష్టికాహారం పంపిణీ, గర్భిణులకు సామూహిక సీమంతం,చిన్న పిల్లలకు అన్నప్రాసన తదితర కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. తల్లులకు పండ్లు, ఫలహారాలు అందజేసి సన్మానించారు. పిల్లలకు ఆరు నెలలకు వరకు పౌష్టికాహారం పెట్టాలని వారికి సూచించారు. తల్లీ బిడ్డలు మంచి ఆహారం తీసుకున్నప్పుడు మాతా–శిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఐసీడీఎస్ అధికారులు క్రిష్ణవేణి, సుజాత, అంగన్‌వాడి కార్యకర్తలు, నాయకులు టీఎం.బాబునాయుడు, గోపాల్ నారాయణ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



ధర్మపురిలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

బైరెడ్డిపల్లె: పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ మాధవీలత అన్నారు. మండలంలోని లక్కనపల్లె, ధర్మపురి, బైరెడ్డిపల్లెలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండేందుకు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లత, సుజాత, రమాదేవి, సీహెచ్‌ఓ అనూరాధ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డ్రైవర్లకు లైసెన్సులు తప్పనిసరి

పుంగనూరు: ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని స్థానిక ఎంవీఐ సుప్రియ హెచ్చరించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. యువకులు విచ్చలవిడిగా వాహనాలతో ఫీట్లు చేయడం, ప్రమాదాలు సృష్టిస్తూ అమాయకులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటికి చెక్ పెట్టే దిశగా వాహనాలను ఆకస్మిక తనిఖీ చేస్తామని, వాహనాలకు సరైన రికార్డులతో పాటు లైసెన్సులు లేకపోతే జరిమానాలు విధించి, వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై ప్రజలు అవగాహన కలిగి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు మెరుగు పరచాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ డీఈఈ, ఏఈ, పంచాయతీ సిబ్బందితో ఆయన సమావేశమమై మాట్లాడారు. మండలంలో ఇటీవల డెంగీ జ్వరాలు, విష జ్వరాలు ప్రబలుతున్నాయని, వైద్యాధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. దోమల నిర్మూలనకు మురుగు నీటి కాలువలను పరిశుభ్రం చేయడం, ఫాగింగ్ చేయడం, బ్లీచింగ్ చేయడం వంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక



బాలికల వాలీబాల్ విన్నర్స్, రన్నర్స్, బాలుర వాలీబాల్ విన్నర్స్‌తో విద్యాశాఖ అధికారులు

పలమనేరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన అండర్–14 విభాగం బాల బాలికలకు స్థానిక బాయ్స్ పాఠశాలలో గురువారం ఎంపిక పోటీలను నిర్వహించారు. సెలెక్షన్స్‌ను ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ప్రారంభించారు. ఇక్కడ జరిగిన నిర్వహించిన పోటీల్లో బాలుర కబడ్డీలో విన్నర్స్ కొలమాసనపల్లి, రన్నర్స్ డొడ్డిపల్లె, వాలీబాల్‌లో విన్నర్స్‌గా ఎం.కోటూరు, రన్నర్స్‌గా ఓఎల్ఎల్ స్కూల్, బాలికల కబడ్డీలో విన్నర్స్‌గా కొలమాసనపల్లె, రన్నర్స్‌గా డొడ్డిపల్లె, వాలీబాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, రన్నర్స్‌గా ఎం కోటూరు నిలిచాయి. అలాగే యోగా పోటీలను కూడా నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులతో మండల జట్లను రూపొందించి నియోజకవర్గ స్థాయి పోటీలను పంపనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం షంషీర్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడలతో ఉల్లాసం



బైరెడ్డిపల్లెలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు

బైరెడ్డిపల్లె: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనాలని, తద్వారా శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం అండర్–14 మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను బాల బాలికల విభాగాల్లో నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయిలో పాల్గొంటారని ఎంఈఓ సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం నసీబ్‌జాన్, ఫిజికల్ డైరెక్టర్లు అమరనాథ్, సుజాత, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ఫలితాల్లో పీఈఎస్ ప్రతిభ


మాధవి


కల్యాణి


తేజస్విని


సుజిత్‌రెడ్డి

గుడుపల్లె: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ పరీక్ష ఫలితాలలో పీఈఎస్ మెడికల్ కాలేజీ ప్రతిభ చాటిందని కళాశాల ప్రిన్సిపల్ హెచ్ ఆర్ క్రిష్ణారావు తెలిపారు. తమ కాలేజీ నుంచి పరీక్షలు రాసిన 150 మందిలో 136 మంది 90.67 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో డిస్టింక్షన్‌లో ఆరుగురు, ఫస్ట్‌క్లాస్‌లో 79 మంది, సెకండ్ క్లాస్‌లో 51 మంది ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. మాధవి 81శాతం, కల్యాణి 79 శాతం, తేజస్విని 78 శాతం, సుజిత్‌రెడ్డి 77 శాతం, సుమేధ ఎన్ని 77శాతం, షేక్ ఫైస్తా 75 శాతం మార్కులతో ప్రతిభను చాటారని పేర్కొన్నారు.

డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు

- ఎంవీఐ మధుసూదన్

పలమనేరు: పలమనేరు పరిసర ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు 80శాతం డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే జరిగాయని పలమనేరు ఎంవీఐ మధుసూదన్ గురువారం తెలిపారు. మొగిలి ఘాట్‌పై అవగాహన లేనికారణంగా కొన్ని మేజర్ ప్రమాదాలు సంభవించాయన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్లు నిద్ర లేమి, మద్యం మత్తు కారణంగానే జరుగుతున్నట్టు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు రెన్యూవల్స్ కోసం వచ్చే డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

వరసిద్ధునికి నృత్యార్చన



గణేష దీక్షలతో భక్తులు





కాణిపాకం: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక దేవస్థాన ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అదుర్స్ అనిపిస్తున్నాయి. కూచిపూడి, భరతనాట్యంతో కళాకారులు గురువారం అదరగొట్టారు. చూపరులను మైమరపించేలా చేశారు. గీతాలాపనలు, హరికథా కాలక్షేపం, పౌరాణిక నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ అధికారులు కళాకారులను అభినందించారు.

నిత్యాన్నదానం, గోసంరక్షణకు విరాళం

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి గురువారం ఓ దాత నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు నగదు విరాళం అందించారు. చిత్తూరు నగరానికి చెందిన బీఎంరెడ్డి అన్నదానానికి రూ.1,10,000, గోసంరక్షణకు రూ.50వేలు అందజేశారు. వీరికి ఆలయ అధికారులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



వరసిద్ధుని సేవలో కొరటాల

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం సినీ దర్శకుడు కొరటాల శివ దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లను చూశారు. ఆశీర్వచన మండపంలో స్వామి ఆశీర్వచనాలతో పాటు ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్ ఉన్నారు.